# సంఘ పురాణం

**ఉపోద్ఘాతం**

1. సంఘోద్భవం
2. వామనుడు త్రివిక్రముడగుట
3. టౌను హాలుకి తరలి వెళ్లుట
4. నటాగ్రేసరుని సన్మానించుట
5. శకటమును గూల్చుట
6. సంఘ వర్ధిక ఫలకమును దించుట
7. సమితి రక్షణ
8. తుది పలుకు

# ఉపోద్ఘాతం :

మానవులు సంఘజీవులు, అందుకని నలుగురు మనుషలొకచోట చేరితే సాంస్కృతిక సంఘాలని, విజ్ఞాన సమితులని, సంపన్నుల క్లబ్బులని, శ్రామికుల యూనియన్లని, భక్త సమాజాలని రకరకాలవి ఏర్పడుతూ ఉంటాయి. అవిరి, నీరు, మంచు ఒక్క పోలిక నుండవు. కాని చూడ చూడ అవి వేరు కాదు అని తెలుస్తుంది. అలాగే ఈ సంఘాలన్నిటి జాడ ఒకటే. పేర్లే తేడా. అవన్నీ ఒకలాగే పుట్టి, బతికి, బట్టకట్టి, బజార్న పడ్తాయి. కోర్టుల కెక్కుతాయి, మట్టికొట్టుకు పోతాయి.

చీమలు పెట్టిన పుట్టలు ఒక సైజుకి పెరిగాక, చీమల్ని దూరంగా తరిమేసి, పాములు ఆక్రమించి హాయిగా వాడుకుంటాయి. ప్రతి సంఘానికి ఫౌండర్ మెంబర్లు వేరు. ఫౌండేషన్ స్టోన్ మెంబర్లు వేరు. రెండో జాతి జనం ఏదైనా సంఘం కాస్త నిలదొక్కుకుని ఏ భవనమో కట్టు కొందామనుకొంటున్న సమయంలో ప్రత్యక్షమై శంకుస్థాపన ఫలకం మీద పేరు వ్రాయించేసుకొంటారు.

సంఘాలంటూ ఉంటే వాటికి అధ్యక్షులు కార్యదర్శులు అంటూ పదవులుంటాయి. ఆ పదవుల కోసం జన్మించిన కారణజన్ములుంటారు. వీరికి సంఘాల అవసరం ఎంతైనా ఉండడంచేత, సంఘాల్లేక పోతే వీరి జీవితం దుర్భరం కనుక వీరిని సంఘ జీవులనవచ్చు. మనుషులు సంఘజీవులు, కనుక వీరే నిజమైన మనుషులు, వీళ్ళు కాని వాళ్ళు సాధారణ సభ్యులు, వీరు సంఘాల్ని నడిపించేవారు. వారు (సాధారణ సభ్యులు) నడి, చెడు వారు. వీరి లీలలే ఈ పురాణం. ఈ రచన వీరి గురించి, వీరి కోసం కనుక వీరికే అంకితం!

★

## ౧. కొత్త సంఘం పుట్టింది
## (లేక) సంఘోద్భవం :

అదో పెద్ద ఊరు. ఆ ఊరు ఆంధ్ర దేశానికి దూరంగా ఉంది. అందుకని ఆ ఊళ్లో ఆంధ్రులకి ఒకళ్ళంటే ఒకళ్ళకి అభిమానం ఉంది. అందరికి కలిసి తెలుగంటే తగని అభిమానం.

ఆ ఊళ్ళో చీమల పేటని ఓ పేటుంది. అక్కడ మనుషులిళ్ళు కట్టక పూర్వం కాలు మోపడానికి వీల్లేనన్ని చీమల పుట్టలుండేవని అందుకే ఆ పేటకా పేరు వచ్చింది అని, ముసలివాళ్ళు మనవలకి చెప్తూ ఉంటారు. అయితే ఆ ఊళ్లో ఉద్యోగరీత్యా వచ్చి ఆ పేట అద్దె ఇళ్లలో అమరిపోయిన వాళ్ళు "ఇక్కడుంటున్న జనం చీమలలాంటి సన్నకారు జనం. కోపం వచ్చినప్పుడు అరవటం తప్ప ఏం చెయ్యలేరు. అందుకని చీమల పేట అన్నారు'' అంటూ చెప్పుకుని ఆనందిస్తూ ఉంటారు.

అటువంటి పేటలో రంగారావున్నాడు. అతను యూనివర్సిటీలో చదువుకొనేరోజుల్లో నాటకాలు వేసేవాడు అనే కంటే యూనివర్సిటీలో నాటకాలు వెయ్యడం కోసం తప్పనిసరిగా చదుకునేవాడు అనడం న్యాయం. అతనికా ఊరు వచ్చినప్పటి నుంచి తోచడం లేదు. ఎక్కడైనా కాస్త ఎత్తయిన అరుగు కనిపిస్తే "ఇది మాత్రం స్టేజిగా ఎందుకు పనికిరాదు! నాలుగు దుప్పట్లు కడితే సుబ్బరంగా పనికొస్తుంది'' అనుకునేవాడు. అక్కడ చుట్టు పట్ల ఎవరూ లేకపోతే ఒకట్రెండు డైలాగులు ఆ అరుగు మీద నిలబడి చెప్పేవాడు. అటువంటి రంగారావుకి ఆ ఊళ్ళో ఉద్యోగం రావడం ఈత రాని వాడిని చెరువులో పడేసినట్టుగా, చేపని గాల్లో విసిరేసినట్టుగా, పల్లెటూరివాడ్ని బొంబాయిలో పడేసినట్టుగా ఉంది. ఎందుకంటే ఆ వూళ్ళో ఎవరికీ తెలుగు నాటకాలను ప్రదర్శించడం పట్ల ఆసక్తి లేదు.

రంగారావు ఓపిక పట్టినన్నాళ్ళు ఓపిక పట్టి ఒక రోజున తన యీడు వాళ్ళని, తనకి తెలిసిన వాళ్ళని తన యింటికి టీకి పిలిచి "మీరు తీరిక సమయాల్లో ఏం చేస్తూ ఉంటారు?'' అని అడిగాడు. కొంతమంది 'పెళ్ళాల్తో కబుర్లు చెప్తాం అన్నారు. మరి కొందరు డబ్బు పెట్టి పేకాడ్తాం' అన్నారు. కొందరు ఉత్సాహవంతులు 'మా తీరిక సమయాల్లో.... సాయంత్రాలు ఏమీ చెయ్యం.... ఏం చేసినా చీకటి పడ్డాకనే. ఏం కథ? మీరూ మాలో చేర్తారా?' అని అడిగారు.

ఓ నలుగురు మాత్రం "ఏం చేస్తే బావుంటుందంటారు?'' అని అడిగారు.

రంగారావు చెప్పాడు "మనం ప్రతి నెల మొదట్లోను ఒక నాటకం వేద్దాం. దానికి ఆ క్రితం నెలంతా రిహార్సల్స్ వేసుకొందాం".

"మనం నాటకం వేసేమే అనుకోండి గురువుగారూ! కాని అదెవరు చూస్తారు?" అని అడిగాడు వెంగన్నారావు. అప్పటికే వెంగన్నారావుకి నాటకాలు వెయ్యాలన్న ఉత్సాహం ఉండేది. ఎవరైనా చెప్తే వాళ్ళతో వెంగన్నారావు త్వరగా ఏకీభవించగలడు, ఉత్సాహంగా ముందుకి రాగలడు.

"టికెట్టు లేకుండా రానిస్తే చాలా మందే వస్తారు నాటకాన్ని చూడటానికి. కనీసం చదువులు మానేసి పెళ్ళి కోసం కాచుకొని ఇంట్లో కూర్చున్న ఆడపిల్లలు కాలక్షేపం లేక, ఇల్లాంటి వేమన్నా ఉంటే పరిగెత్తు కొచ్చేస్తారు. వాళ్ళ గురించి హుషారైన మగపిల్లలొస్తారు. వాళ్ళ నుంచి వాళ్ళ అమ్మాయిల్ని కాపాడుకోడానికి ఆ ఆడపిల్లల బాబులు, వారితోబాటు వారి భార్యలు, కొండొకచో తల్లులు వస్తారు. ఇటు మగపిల్లల తల్లిదండ్రులు, వారి సుపుత్రులెవరి వలలోనైనా పడి "కానీ కట్నం లేకుండా పెళ్ళాడేస్తామ"ని ప్రమాణాలు చేస్తారేమోనన్న బెంగతో వస్తారు. అందుచేత మన నాటకం చూడటానికి బోలెడు మంది జనం వస్తారు" అన్నాడు రంగారావు.

"నిజమే నండోయ్" అంటూ ఏకీభవించాడు వెంగన్నారావు. అల్లా వెంటనే ఏకీభవించిన వెంగన్నారావు, "మరి నాటకం వెయ్యడానికి స్థలమో?" అంటూ అది సంపాదించడం కష్టం అన్న సందేహం వెలిబుచ్చాడు.

"రవీంద్ర భారతులు, టౌనుహాళ్లు అంటే కష్టం గాని, మన చీమలపేటలో నాటకం వేసుకొనే చోట్లు లేకపోలేదు. పక్కనే ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూల్లో మనం నాటకాలు వెయ్యచ్చు. ఎలెక్ట్రిసిటీ ఛార్జీలు, కర్టెన్ల అద్దె, హాలు అద్దె కలుపుకొని నలభై రూపాయలు. కుర్చీలు, మైకులు ఉండవు. మనం ఇళ్ళ నుంచి జంబుఖానాలు తెచ్చి వెయ్యచ్చు. మైకుల అవసరం లేకుండా గొంతు పెంచి సంభాషణలు చెప్పొచ్చు. మధ్యలో మైకులు ఫెయిల్ అవడం అంటూ ఉండదు" అన్నాడు రంగారావు.

"మరేనండోయ్, మైకులు లేకపోవడం ఒక పెద్ద నావెల్టీ మన నాటకాలకి. మరి మేకప్....?....ఆ....దాన్దేముంది లెండి, మనమే చేసుకుందాం. కాని ప్రతి నెల నలభై రూపాయలు ఎక్కడినుండి వస్తాయి?" అని అడిగాడు వెంగన్నారావు.

"ఎవరన్నా ఊళ్ళో డబ్బున్న పెద్దవాళ్ళని పోషకులుగా పెట్టుకొందాం" అన్నాడు అంతవరకు నోరు విప్పని రెడ్డి. అతనికి మనం అడగాలేగాని డబ్బున్న పెద్దవాళ్ళు డబ్బిచ్చేస్తారని, వాళ్ళు అందుకే భూమ్మీదున్నారని నమ్ముతాడు. అందుకే "అంటే డబ్బిచ్చేస్తారు కనక అని కాదు డబ్బివ్వటానికే" అని.

"వద్దు, డబ్బున్న వాళ్ళెవరు వాళ్ళకి ప్రయోజనం లేకుండా పది పైసలు కూడా ఖర్చు పెట్టరు. మనమే తలో అయిదు వేసుకొని...." అని రంగారావు చెప్తుంటే "చేత్చుమురు భాగోతం ఆడ్దామంటారా?" అని కోపంగా అడిగాడు రెడ్డి.

"అది కాదు నా ఉద్దేశం. మనం ఇచ్చేది సభ్యత్వపు చందా. నాటకం నాడు పళ్ళెం తిప్పుదాం. సభ్యుల్ని చేర్చుకొందాం. ఆ విధంగా మనం చేతి చమురు భాగవతం ఆడాల్సిన అవసరం ఉండదు. అందుకని మనమంతా మన చందాలు కట్టేస్తే అది మూల ధనంగా పెట్టి మొదటి నాటకం వెయ్యొచ్చు. ఆ నాటకం చూశాక చాలా మంది మన సంఘంలో సభ్యులవుతారని నా నమ్మకం" అన్నాడు రంగారావు.

సమావేశానికి వచ్చిన వాళ్ళందరు దాన్ని ఆమోదించారు.

పక్షం తిరిగే సరికి అప్పర్ ప్రైమరీ స్కూల్ ఆవరణలో రంగారావు, రెడ్డి, వెంగన్నారావులు వాళ్ళ బృందంతో కలిసి నాటకం ఆడారు. ఇద్దరు పెళ్ళికాని చాకుల్లాంటి అమ్మాయిల్ని బతిమాలి, వాళ్ళ చేతులకి పళ్ళాలిచ్చి జనం మీదికి పంపారు. వాళ్ళకి తెలిసిన వాళ్ళు తెలుసు కనుక, తెలియని వాళ్ళుమొహమాటానికి, కొందరు అడుగుతున్న వాళ్ళు ఆడపిల్లలని తలో పావలా అర్ధా వేశారు. నలభై రూపాయలు వసూలైంది. ఆ వూళ్ళో అన్ని సంవత్సరాలుగా ఎవరూ తెలుగు నాటకం చూసెరగరు. అందుకని అందరికీ ఆ నాటకం నచ్చింది.

నాటకం వేసిన తరువాత మొదటి ఆదివారం రంగారావు, రెడ్డి, వెంగన్నారావు నాటకానికి వచ్చిన వారిలో వారికి తెలిసినవారిని సభ్యులుగా జేరమని, వారిళ్ళకి వెళ్ళారు. ఆ విధంగా ఓ యాభై మందిని సభ్యులుగా జేర్చుకొన్నారు.

దాంతో రెండో నాటకాన్ని మైకులు, ఫ్లడ్ లైట్లు లాంటి హంగుల్తో ప్రదర్శించ గలిగారు. ఈసారి తాము గూడా పళ్ళాలు పుచ్చుకొని హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ అందరి ముందర మెరిసిపోవాలన్న కోరికతో అప్పటికప్పుడు కావాలంటే పళ్ళాలుంటాయి ఉండకపోతాయని తమవెంట పళ్ళాలు తెచ్చుకున్న అమ్మాయిలు, నిరాశ పొందారు. అల్లా నిరాశ పొందిన అమ్మాయిలలో ఒక అమ్మాయి తల్లి పద్మావతీదేవి. "మీకు కావాలంటే మా అమ్మాయి పళ్ళెం తిప్పిపెడ్తుంది, అక్కర్లేదంటే మీ ఖర్మ" అంటూ కబురు పెట్టింది. పద్మావతికి సంఘ కార్యక్రమాలపట్ల బోలెడు ఆసక్తి, కూతురు పెళ్ళి పట్ల కొంచెం ఆత్రుత ఉన్నాయి. అందుకని ఆ పిల్లని వీలైనంత వరకు నలుగురి దృష్టిలోకి తెస్తూ ఉంటుంది. ఆ విధంగా చేస్తూ పోతుంటే ఏదో ఒక రోజు, ఎవరో ఒక రాజకుమారుడు ఎంచక్కాఆ పిల్లని విమానం ఎక్కించుకొని విదేశా ల్తీసుకు వెళ్తాడు. ఈలోపల తను పెళ్ళి జరిపించేస్తుందని, నమ్ముతుంది. పద్మావతీదేవి భర్త పద్మావతీదేవి నమ్మిందంతా నమ్ముతాడు. ఇంతకూ ఆరోజు రంగారావు పళ్ళెం తిప్పించటాని కిష్టపడక, వచ్చే ఆదివారం తాము అందర్నీ కలుసుకుంటామని అప్పుడు అందరూ సభ్యులుగా చేరితే తాము సంతోషిస్తామని మైకులో చెప్పాడు. తనను తప్పకుండా కలుసుకోమని కబురుపెట్టింది పద్మావతీదేవి. రంగారావు, రెడ్డి, వెంగన్నారావు ఆవిధంగా మరో నాటకం ఆడారు.

## 2. వామనుడు త్రివిక్రముడగుట :

మరుసటి ఆదివారం రంగారావు, వెంగన్నారావు, రెడ్డి మెంబర్ షిప్ డ్రైవ్ మీద

బయల్దేరారు. ప్రతీవాళ్ళు "చందాలు అడుగుతున్నారు కదా! ఈ సంస్థ ఆశయాలేమిటి? కాన్స్టిట్యూషన్ ఉందా? ప్రెసిడెంటెవరు?" అంటూ అడగడం మొదలుపెట్టారు. పద్మావతీదేవి కూడా "మీకివేవీ లేకపోతే సర్వసభ్య సమావేశం పెట్టి ప్రెసిడెంట్లని వాళ్ళని ఎన్నుకుందాం" అంది.

రంగారావు "నెలకో నాటకం వెయ్యడం దీని ఆశయం. నాటకం వెయ్యడానికి నటులు, దర్శకులు ముఖ్యంగాని అధ్యక్షులు వాళ్ళు కారు. మనమేం రిజిష్టర్ చేసుకోబోవడం లేదు కనుక కాన్స్టిట్యూషన్ అనవసరం" అన్నాడు మిగిలిన ఇద్దరితో ఆ సాయంత్రం.

"నిజమేనండి గురువుగారూ! ఈపాటి దానికీ హడావిడి అనవసరం" అన్నాడు వెంగన్నారావు.

"కాదు, మనకో రాజ్యాంగం అదీ ఉండి, నాటకాలు వేయడం ఒక ముఖ్యాశయమే అయినా, వేరే కొన్ని ఆశయాలను కూడా జోడించి, పెద్దవాళ్ళ నెవర్నైనా అధ్యక్షులుగా ఎన్నుకుంటే మన సమితికి ఢోకా ఉండదు. పెద్దల అండదండలుంటాయి." అన్నాడు రెడ్డి. రెడ్డికి పెద్దలంటే ఉన్న గురికొద్దీ.

"అదీ నిజమేనండోయ్" అన్నాడు వెంగన్నారావు.

"సర్వసభ్య సమావేశం ఏర్పరచి సభ్యుల అభిప్రాయాలను తెల్సుకోవడం, వాటిని గౌరవించడం ధర్మం. మనం ఆఫ్టరాల్ వాళ్ళిచ్చే చందాల మీదే ఆధారపడబోతున్నాం కదా" అన్నాడు రెడ్డి.

"మరే, అది మన కనీస ధర్మం" అన్నాడు వెంగన్నారావు. రంగారావు శిరసావహించాడు. సర్వసభ్య సమావేశం అప్పర్ ప్రైమరీ స్కూల్లో, వాళ్ళని బతిమాలుకొని ఒక క్లాస్ రూంలో ఏర్పాటు చేశాడు.

వంద మంది సభ్యుల్లోను ఓ ముప్పై మంది దాకా వచ్చారు అనుకున్న సమయానికి. మరో పది మంది మీటింగ్ పూర్తయ్యే సమయానికి వచ్చారు. తెలుగు సంఘాన్ని "రిజిష్టర్ చేస్తే లాభాలున్నాయి కనుక రిజిష్టర్ చేద్దామంది" పద్మావతీదేవి.

"ఏమిటా లాభాలు?" అని వెంగన్నారావు కుతూహలంగా అడిగాడు.

"గవర్నమెంటు గ్రాంట్లివ్వాలన్నా, కమర్షియల్ టాక్స్ ఆఫీసరు మనల్ని ఓ బెనిఫిట్ షో వేసుకోనివ్వాలన్నా రిజిష్టరవటం మంచిది" అన్నాడు పద్మావతీదేవి భర్త.

"మనదానికి వంద మంది సభ్యులు. అయిదు వందల రూపాయల ఆదాయం. దీనికి ఓ రిజిస్ట్రేషన్, ఆడిటర్ను, బాలెన్సు షీట్లు హడావిడి అనవసరం" అన్నాడు రంగారావు.

"అదేం మాట? మన సంఘం ఎప్పుడూ అలా చిన్నగానే ఉంటుందా? ఎప్పుడూ నాటకాలు మాత్రమే వేస్తామా? సంఘం అంటూ ఉన్నాక తెలుగువాళ్ళ కుపయోగపడే కార్యక్రమాలు పెట్టుకోమా?" అంది పద్మావతీదేవి.

రంగారావు "ఈ సంఘం మేం పెట్టుకోడంలో ఉద్దేశం నెలకో నాటకం వేసుకుందాం

అని, నాటకాలని చూడటాని కిష్టపడేవాళ్ళని సభ్యులుగా చేర్చుకుందామని అనుకొన్నాం" అని స్పష్టం చేశాడు.

"నిజమేనండి రంగారావుగారు! పెట్టుకొనేటప్పుడు మనదదే ఉద్దేశం. జేరినప్పుడు సభ్యులదీ అదే ఉద్దశం. కాని జేరాక సభ్యులకి వేరే ఉద్దేశాలుండవచ్చు కదా! విందాం. సభ్యులందరిది ఒక ఉద్దేశం, మనదొకటి అయితే మనం కూడా వాళ్ళ మార్గాన్నే పోవటం ధర్మం" అన్నాడు రెడ్డి.

ఒక్కొక్క సభ్యుడే లేచి తన ఉద్దేశంలో సంఘం ఎలా ఉండాలో చెప్పాడు. ప్రతివాళ్ళ ఉద్దేశం కూడా ఈ సంఘం చీమలపేటలోని సభ్యుల్ని ముందుగాను, ఆ పట్నంలోని తెలుగు వాళ్ళని తరవాత, ప్రవాసాంధ్రుల్ని అంతా ఆ తరువాత, దేశంలోని ఆంధ్రులంతా ఇంకొంచెం ఆ తరువాత, ప్రపంచంలోని ఆంధ్రుల్నంతా మరికొంచెం ఆ తరువాత ఒకే తాటి మీద నడిపించి చరిత్రలో తెలుగువారి స్వర్ణ యుగాన్ని తిరిగి భూమ్మీద స్థాపించాలనే! దానికి సంవత్సరానికో రోజు పెద్ద పెట్టున కార్యక్రమాల్ని ఏర్పరచాలని అన్నారు. ఆ రోజు గురజాడ జన్మదినమో, కందుకూరి వర్ధంతి దినమో అయితే బావుంటుందని కొందరన్నారు. మరి కొందరు త్యాగరాజు దినం పెడ్దామన్నారు. కృష్ణదేవరాయల పేరు, శాతవాహనుల, శాలివాహనుల పేర్లు బయటికి వచ్చాయి. కాస్సేప్పాటు శాతవాహనులు, శాలివాహనులు ఒకళ్ళేమోనన్న విషయం గురించి అనుమానపడ్డారు. చివరికి తెలుగువాళ్ళకి ముఖ్యమైన పండుగ సంక్రాంతి కనక సంక్రాంతికి ఈ కార్యక్రమాన్ని ఏర్పరచాలని నిర్ణయించారు.

"రోజంటూ నిర్ణయమైంది కనక ఆ రోజు నాటికల పోటీ నిర్వహిద్దాం. అప్పుడు చీమలపేట సభ్యులకి మిగిలిన పేటల్లో ఉండే తెలుగువారి నటనా నైపుణ్యాన్ని చూసి ఆనందించే అవకాశం కలుగుతుంది. ఎల్లాగో నాటకాల పోటీ నడుపుతున్నాం కనక ఆ రోజున ఆంధ్రుల అభిమాన నటుడి కొకరికి సన్మానంచేసి ఆయనచేత బహుమతి ప్రదానం చేయిస్తే బావుంటుంది." అన్నాడో ఆయన. "అయిడియా బాగానే ఉంది" అన్నాడు వెంగన్నారావు. "ఆ రోజున కావాలంటే మా అమ్మాయి చేత నటుడి మెడలో దండ వేయించవచ్చు." అంది పద్మావతీదేవి. ఆవిడ అనాథ ఆశ్రమం కోసం చందా అడిగిన వారికి అనాథలను దానం చేసే బాపతు. ఏడాదికో అభిమాన నటుడిని పిలిచే విషయంలో ఏకాభిప్రాయం కుదిరిపోయింది. ఆయన భుజం రాసుకుంటూ ఎవరు కూర్చోవాలన్నది తరువాత ఆలోచించ వచ్చుననుకున్నారు. ఆ విధంగా వామనుడి కాలు భూమంతా ఆక్రమించింది.

ఆ సభలో రామనాథం ఉన్నాడు. ఆయనకు స్కూలుకు వెళ్తున్న పిల్లలున్నారు. వాళ్ళు మూడు సంవత్సరాల క్రితం తెలుగు దేశంలో తెలుగు చదువుకొని తండ్రికి ట్రాన్స్‌ఫర్ అవగా ఈ ఊరువచ్చి యాభై వేల మందున్నారని గర్వంగా చెప్పుకొనే ఊళ్ళో తెలుగు చెప్పే స్కూలు దొరకక, ఏ స్కూలుకి వెళ్ళినా "ఇంతవరకు తెలుగు చదువుతామని వచ్చింది మీరే" అని ఆ స్కూలు అధికారులంటుంటే ఏం చెయ్యాలో తోచక స్వంత బాధ్యత మీద తెలుగు చదువుకునే ఏర్పాటు మీద తలో స్కూల్లో జేరిపోయారు. అన్ని రాష్ట్రాలలో లాగానే ఆ

రాష్ట్రంలోను అల్ప సంఖ్యాక వర్గాన్ని రక్షించేందుకు రక్షణ సమితుంది. అయిదుగురికి మించి తెలుగు చదువుతామని ముందుకు వస్తే, తెలుగు మేష్టర్ని, స్కూళ్ళల్లో ఏర్పాటు చెయ్యాలన్న నిబంధన ఉంది.

"అయితే ఎవరు మటుకు వాళ్ళు మనకేగాని ఇంకెవరికి తెలుగు అక్కర్లేదు గామోసు" అనుకోవడంలో ఎవరూ ఆ రక్షక సమితి వద్ద మొరపెట్టుకోలేదు. కాని ఈమధ్య రామనాధానికి తన పిల్లలు చదువుకొంటున్న బళ్ళలో ఇలాగే మోసపోయిన పిల్లలున్నట్టు తెలిసింది.

అందుకని రామనాథం ఆ సభలో "ఈ సంఘం ద్వారా మనం స్కూళ్ళలో తెలుగు విషయమై అలజడి చెయ్యాలి" అంటూ గట్టిగా చెప్పాడు. "అది వీలు కాకపోతే మనమే ఓ స్కూలు నడుపుదాం" అంటూ ఉద్రేకపడ్డాడు.

"మనకంటూ ఓ భవనం ఉన్నప్పుడే అది వీలవుతుంది" అని రంగారావు నోరు జారాడు. "కడ్దాం" అన్నారు సభ్యులు ముక్తకంఠంతో. "అదే మన తక్షణ కర్తవ్యం" అన్నారు ఉద్రేకం పాలు ఎక్కువ ఉన్నవారు.

"పేట పేటా ఓ తెలుగు పాఠశాల" అంటూ ఓ యువకవి నినాదాన్ని రూపొందించాడు. సభ్యులు దాన్ని బలపరిచారు.

వామనుడి మరో కాలు ఆకాశం అంతా ఆక్రమించింది.

"మనం ఈనాడు చేపట్టిన కార్యక్రమం నడిపించే సారధుల్ని మనం ఎన్నుకోవాలి" అన్నాడు రామనాథం.

"అందులో ఒకరైనా ఆడవాళ్లుంటే బావుంటుంది" అన్నాడు పద్మావతీదేవి భర్త.

రామనాథంగారు అధ్యక్షుడిగా ఉంటే బావుంటుందని పద్మావతీదేవి, ఆవిడ ఉపాధ్యక్షురాలిగా ఉంటే బావుంటుందని రామనాథంగారు సూచించారు. సభ్యులు ఆమోదించారు.

రెడ్డి తనకి కోశాధికారిగా ఉండటానికి అభ్యంతరం లేదన్నాడు.

కార్యదర్శిగా ఉత్సాహవంతుడైన యువకుడుండాలని దానికి రంగారావే తగునని రామనాథం గారన్నారు. సభ్యులు చప్పట్లు కొట్టారు. వామనుడు తన మూడో కాలు రంగారావు తలపై నుంచాడు.

రంగారావు, తను అమ్మాయిని చెయ్యబోతే ఈ సంఘం అమ్మవారై కూర్చుందే, అటువంటప్పుడు తను నెగ్గగలడా అని కలవర పడ్డాడు.

ఆపైన తెలుగు సంఘం పేరు ప్రభుత్వపు రిజిష్టర్సులో జేరిపోయింది.

## 3. అప్పర్ ప్రైమరీ స్కూలు నుంచి టౌను హాలుకు తరలి వెళ్ళుట :

తెలుగు సంఘం నెమ్మదిగా నిలదొక్కుకుంది. ఒక్కొక్క స్కూల్లో, ఒక్కొక్క కాలేజీలో ఎంతెంతమంది తెలుగు వాళ్ళ పిల్లలు చదువుకొంటున్నారు? ఇందులో తెలుగు ఎంత మందికి కావాలి? మొదలైన వివరాలు సేకరిస్తున్నారు. అందరిలోకి ఏ పదవీ లేని వెంగన్నారావు

హడావిడి పడిపోయి "మనం ఇది చేద్దాం గురువుగారూ! అది చేద్దాం గురువుగారూ" అంటూ చక చక తిరుగుతున్నాడు. ఏదన్నా కొంచెం సాధించ గలిగితే బోలెడంత గర్వపడ్తున్నాడు, "ఇప్పుడిప్పుడే ఈ ఊళ్లో తెలుగు వాళ్ళకి గుర్తింపు వస్తోంది" అంటూ.

రంగారావు బృందం అప్పర్ ప్రైమరీ స్కూల్లో మరో నాటకం ప్రదర్శించారు. ఆ రోజున ఆలస్యంగా వచ్చినా, పద్మావతీదేవి, ఆవిడ కూతురు కూర్చున్న వాళ్ళని మనిషి మనిషిని పలకరించి ఆదరించారు. ఈ విధంగా సభ్యులు పరస్పరం పలకరించుకొంటూ ఉంటే రంగారావు నాటకం ఆడాడు. సభ్యులు నాటకానంతరం "మా అమ్మాయికి మంచి సంబంధం ఉంటే చెప్పండి"; "మా తమ్ముడు విదేశాలనుంచి వచ్చి అర్జెంటుగా పెళ్ళి చేసుకొని పెళ్ళాన్ని తీసుకువెళ్లాడు"; "ధనలక్ష్మి స్టోర్సులో కొత్త చీరలు వచ్చాయి"; "రామ్ సింగ్‌కి మళ్ళీ ఈ ఊరు ట్రాన్స్‌ఫర్ అయిందటగా" అనుకొంటూ విడిపోయారు.

కొంత మంది రంగారావుతో "మీ నాటకం ధర్మమా అని తెలుగు వాళ్ళంతా కలుసు కోడానికైంది" అన్నారు.

అతికొద్ది మంది మాత్రం "ప్రేక్షకుల్లో కలకలం ఎక్కువగా ఉండి సరిగా వినబడలేదు గాని నాటకం బావుంది" అన్నారు.

వినాయక చవితి నాటికి ఊళ్ళో తెలుగు మేష్టర్ని రూల్సు ప్రకారం ఏర్పాటు చెయ్యాల్సి నట్టు లెక్కతేలిన స్కూళ్ళు మూడు, కాలేజీ ఒకటి. కాని ఆ పని చెయ్యటానికి వాళ్ళు సుముఖత చూపించక "కావాలంటే మీ పిల్లల్ని మా విద్యాలయం లోంచి తీసేసి మీ గొంతెమ్మ కోర్కెలు తీర్చగల మరోచోట జేర్చుకోండి" అన్నారు. తెలుగు ప్రజలు అల్పసంఖ్యాక భాషాజన రక్షక సమితితో చెప్పారు. వాళ్ళు ఆ రాష్ట్రం ముఖ్యమంత్రితో చెప్పారు. ఆ పైన ఆంధ్ర రాష్ట్రపు ముఖ్యమంత్రి చేత చెప్పించారు.

దాంతో దసరాల నాటికి ఒక స్కూల్లోను, కాలేజీలోను తెలుగు మేష్టర్లు ఏర్పాటు అయ్యారు. ఆ విధంగా తెలుగు సంఘం నలుగురి నోళ్ళల్లో పడింది. ప్రతిష్ఠ సంపాదించింది.

కార్యవర్గ సమావేశంలో "భేష్" "భేష్" అంటూ పరస్పరం వీపులు చరుచుకొన్నారు. "ఎలాగైనా అనుకొన్నది సాధించాం" అంది పద్మావతీ దేవి.

రామనాథం "ఈ సంక్రాంతికి మన కార్యక్రమాలు చీమలపేటకి పరిమితం కాకుండా ఊళ్ళో తెలుగు వాళ్ళందరు వచ్చి పాల్గొనేటట్టు ఏర్పాటు చేయ్యాలి" అన్నారు.

"అల్లా చేస్తే బావుంటుంది" అన్నాడు వెంగన్నరావు.

"ఆ రోజుకి ఓ రిసెప్షన్ కమిటీ వెయ్యండి. కావాలంటే అందులో నేనూ, మా అమ్మాయి కూడా మెంబర్సుగా ఉంటాం" అంది పద్మావతీ దేవి.

"నేను, రంగారావు, వెంగన్నారావు అంతా కలిసి పెద్ద నాటకం వేస్తాం" అన్నాడు రెడ్డి.

"మీ అభిప్రాయం ఏమిటి రంగారావు గారూ" అంటూ రామనాథం అడిగాడు.

"మొదటిది మనం ఆ కార్యక్రమం భారీ యెత్తున నడిపించటానికి మన దగ్గర మూడు వందల రూపాయల కంటే డబ్బు లేదు. రెండోది ఊళ్ళో ఉన్న తెలుగు వాళ్ళ నందరిని ఒక

చోట జేర్చడం విషయం. ఊళ్ళో యాభై వేల తెలుగు వాళ్ళున్నారన్న విషయం మన అందరికీ తెలుసును, యాభై వేల మంది ఏ ఒక్క చోట పట్టరు. టౌను హాలులో కూడా మొత్తం ఎనిమిది వందల మంది కంటే పట్టరు. ఈ యాభై వేలలోను ఏ ఎనిమిది వందల మందిని పిలుస్తాం?'' అన్నాడు రంగారావు.

రెడ్డి దానికి "ఆ రోజు ప్రోగ్రామ్‌కి టికెట్లు పెడ్దాం. ఆ విధంగా ఎవర్ని పిలవాలి అన్న ప్రశ్నుండదు. టికెట్లు కొన్న వారిని పిలుస్తాము. రెండో ప్రశ్న జవాబు అయిందా! మొదటి దానికి వస్తాను. ఈ కార్యక్రమానికి డబ్బెక్కడిది? అని. టిక్కెట్లు పెట్టాం కనుక ఖర్చులు పోను ఏ పదిహేను వందలైనా మిగుల్తుంది. ఇది నా అంచనా, అందుకని కార్యక్రమం తలపెట్టడానికి అయిదు వందలు చేతిలో ఉంటే చాలు. కార్యక్రమం అయ్యే సరికి ఈ అయిదు వందలేకాక మరో పన్నెండు పదిహేను వందలైనా మిగుల్తాయి. మన దగ్గర మూడు వందలుంది. రామనాథంగారో వంద, పద్మావతీదేవిగారో వంద దానం చెయ్యడమో, అప్పివ్వడమో చేస్తారు.' ' అన్నాడు.

"అయ్యో! నా దగ్గరెక్కడుందండీ. రామనాథంగారు పెద్దవారు. కావాలంటే ఆ రెండు వందలు వారే ఇస్తారు. ఆడవాళ్ళకి ఆర్థిక స్వాతంత్ర్యం ఎక్కడుందండీ ఈ పురుష ప్రపంచంలో. ఏదో ధన సహాయం చెయ్యలేక పోయినా సంఘసేవ చేయగలను. దానికి మా వారు ఏమీ అనరు. సహకరిస్తారు కూడాను'' అంది కంగారుగా పద్మావతీదేవి.

"అల్లాగే! ఆ రెండు వందలు ప్రస్తుతానికి నేను సర్దుతాను. కాని మనం ప్రతియేడు టౌనుహాల్లో కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాల్సి, రావడం, దానికి గాను టికెట్లు అమ్మడం కష్టం. అందుకని మనం ఓ చిన్న భవనం కట్టుకోడానికి ప్రయత్నం చెయ్యాలి.ఈ ఊళ్ళో తమిళులకి చాలా రోజులగా వాళ్ళదంటూ ఓ బిల్డింగుంది. మనకి లేదు. మనం కూడా కట్టు కోవాలో భవనం ఎప్పటికో అప్పటికి. అందులో కనీసం ఓ పెద్ద హాలుండాలి అయిదారు వందల జనం పట్టేది.మామూలు రోజుల్లో దాన్ని గ్రంథాలయంగాను, ఆటలు ఆడుకోడం కోసం వాడొచ్చు. కాని ఇల్లాంటి సందర్భంలో మనం కల్చరల్ షోస్ వేసుకోడానికి ఉపయోగ పడేలా కట్టు కోవాలి'' అని ఆగాడు రామనాథం.

"ఈ ఐడియా బావుంది'' అన్నాడు వెంగన్నారావు.

"భవనానికి డబ్బో?'' అని రంగారావు ప్రశ్నించాడు.

"దానికే వస్తున్నాను. మనం టౌనుహాల్లో సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి ఖర్చులు కలిసివచ్చేలా టికెట్లు పెట్టండి. దాంతో పాటు మనం ఓ సావనీరు అచ్చేదాం. ఆ సావనీరు మీద వచ్చిన డబ్బుతో గవర్నమెంటు సహాయంతో ఊరి మధ్య ఓ చిన్న జాగా కొందాం. అందరం కష్టపడి ప్రకటనలు సంపాదిద్దాం. ముఖ్యంగా ప్రదర్శనకి టిక్కెట్లు అమ్మటం, కార్యక్రమం ఏర్పాటు చెయ్యడం రంగారావుగారు, రెడ్డిగారు చేస్తారు. సావనీర్ ఏర్పాట్లు నేను, పద్మావతీదేవిగారు, వెంగన్నారావుగారు చూస్తాం'' అన్నాడు రామనాథం.

కమిటీ ఆ సూచనని ఆమోదించింది. రంగారావు తను ఓ నాటకం తన బృందంతో వేస్తానన్నాడు. చీమలపేటలో వారే కాకుండా మిగిలిన పేటల్లోని తెలుగు వారికి కార్యక్రమం గురించి తెలిసేందుకుగాను న్యూస్ పేపర్‌లో ప్రకటన చెయ్యాలని నిర్ణయించారు. పద్మావతీ దేవి ఆ రోజున తన కూతురు ప్రార్థన పాడుతుందని కూతురు తరఫున వాగ్దానం చేసింది.

ప్రకటన వేశారు. ఉత్సాహవంతులు ముందుకు వచ్చారు. కాస్త ఆకర్షణీయంగా కార్యక్రమం నిర్ణయించారు. ఎవరికి కావలసిన హంగులు వారే కూర్చుకోవాలన్నారు. టికెట్లు అమ్మడం మొదలు పెట్టారు. సావనీర్‌కి ఎడ్వర్‌టైజ్‌మెంట్లు ఇచ్చిన వారికి, కమిటీ మెంబర్ల కుంటుంబాలకు కొన్ని కాంప్లిమెంటరీలు ఇవ్వాలని సూచించింది పద్మావతీదేవి. ఒక నూరు సీట్లు కేటాయించారు ఆమె సూచనను అనుసరించి.

పద్మావతీ దేవి, రామనాథం, వెంగన్నారావు, మొదటి రెండ్రోజులపాటు రామనాథం కార్లో రామనాథంకి తెలిసిన వాళ్ళ దగ్గరికి వెళ్ళి 'మూడు' వేల రూపాయల ప్రకటనలు సంపాదించారు. మూడో రోజు, నాలుగో రోజు పద్మావతీదేవి తెలిసిన వాళ్ళ దగ్గరకు వెళ్ళారు. వాళ్ళంతా ప్రకటనలు ఇప్పుడు, డబ్బు తరువాత ఇస్తామన్నారు.

అయిదో రోజు రామనాథం కారు చెడిపోయింది. "పోనీ ఈ రోజు మీ కార్లో వెళ్దాం" అన్నాడు రామనాథం పద్మావతీదేవితో.

"కారుని మా వారు తీసుకు వెళ్ళారు; మీ కారు బాగుపడ్డాకే వెళ్దాం. ఒక రోజు విశ్రాంతికూడా అవసరం మనకి" అంది ఫోనులో నవ్వుతూ. రామనాథం ఫోను పెట్టేసి ముఖం చిట్లించాడు.

రామనాథం తన వాటాకి పెట్రోలు ఖర్చుపెట్టాడు. పద్మావతీదేవి తన వాటాకి టైము ఖర్చు పెట్టానంది. కార్యక్రమం రోజున లెక్కచూసుకొంటే పన్నెండువేల రూపాయల ప్రకటనలు అచ్చయినా ఎనిమిది వేలే చేతికి వచ్చాయి.

ప్రకటన లిచ్చిన వారిలో సుబ్బారావు వున్నాడు. సుబ్బారావు దగ్గరికి పద్మావతీ దేవి తీసుకు వెళ్ళింది. "ప్రకటనదేముంది ఇస్తాను. కాని నన్ను కూడా మీలో చేర్చుకోండి. నాకు ఈ తెలుగు సమితికి శాయశక్తులా సేవ చెయ్యాలని ఉంది" అన్నాడు.

ఆ మర్నాడు సుబ్బారావు తనకి చాలా విధాల తోడ్పడగలడని, ఆయన్ని కనీసం కమిటీ మెంబరుగా కో ఆప్ట్ చేసుకుంటే బావుంటుందని పద్మావతీదేవి కమిటీకి సూచించింది. మరో మెంబరుంటే నష్టం లేదు కనుక కమిటీ సుబ్బారావును కో ఆప్ట్ చేసుకోడాని కంగీకరించింది.

ఆ విధంగా కమిటీలో ముందర జేరి ఆపైన ప్రకటనిచ్చాడు సుబ్బారావు. డబ్బు మాత్రం తరువాత ఇస్తానన్నాడు. కాంప్లిమెంటరీ టికెట్లు అడిగి మరీ తీసుకున్నాడు.

"సుబ్బారావుగారు డబ్బివ్వలేదు" అని రెడ్డి అంటే.

"ఇస్తాడు. ఆయనకిదో లెక్కా!" అంది పద్మావతీదేవి. పైగా "ఇలా అయిదు, పదీ కాదు మనం అడగాల్సింది. బిల్డింగ్ కట్టడానికి ఏ వెయ్యో విరాళం అడగాలి. ఆయన్ని ఉపయోగించు కొనే విధానం అది" అని నొక్కి చెప్పింది.

సుబ్బారావు కార్యక్రమం రోజున హడావుడిగా తిరిగాడు. కార్యక్రమం ముందు రోజున తెరలు అవీ కట్టిన రోజున తిరగలేదు. అసలా చుట్టుపట్లకే రాలేదు.

"ఏం కుర్రాళ్ళయ్యా మీరు? మైకెక్కడ పెట్టారు? స్టేజిమీద డీప్‌గా ఉన్న పాత్ర మాట్లాడింది మైక్ పిక్ చేస్తుందా? మైకిక్క డుండాలి. మైక్ టెస్టింగ్ సుబ్బారావు స్పీకింగ్ వన్-టూ-త్రీ ఏదీ కర్టెన్ లాగండి నే( చెయ్యెత్తగానే లాగాలి.... యింకొంచెం హుషారుగా ఉండాలి" అంటూ హడావిడి చేశాడు.

హాలు నిండింది. ఊళ్ళో మొట్ట మొదటిసారిగా భారీ ఎత్తున తెలుగు కార్యక్రమం నిర్వహించబడుతోందని తెలుగు వాళ్ళు చాలా మంది ఆ కార్యక్రమాన్ని చూటానికి వచ్చారు. వాళ్ళు సుబ్బారావు హడావిడి చూసి "ఆయనే అధ్యక్షుడు, కార్యదర్శి కూడా" అనుకొన్నారు. "ఆయన కొంచెం గూనిగా నడుస్తున్నాడంటే నడవడు మరీ! ఈ సంఘం బరువంతా ఆయన భుజస్కంధాల మీద ఉంటే" అనుకొన్నారు.

పద్మావతీదేవి కూతురు ప్రార్థనతో కార్యక్రమం మొదలైంది. రామనాథాన్ని సుబ్బారావే వేదిక మీదికి ఆహ్వానించాడు. రామనాథాన్ని ఓ అయిదు నిమిషాలు మాట్లాడనిచ్చి ఆపైన తనూ ఓ పది నిమిషాలు తెలుగు సమితి భవన నిర్మాణానికిగల ఆవశ్యకత వివరించాడు. రంగారావు, రెడ్డి, వెంగన్నారావు మేకప్‌లో ఉండి ఎవరికంటా పడలేదు.

కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. "మా అమ్మాయి ప్రార్థన పాడ్తే మరోలా జరగదు" అంది పద్మావతీదేవి. "నేనొచ్చేసరికి అన్నీ అవక తవకగా ఉన్నాయి. కాని అనుభవం ఉన్నవాడిని కనుక సర్దేశాను" అన్నాడు సుబ్బారావు.

## 4. సంపదలు నాశించి చలనచిత్ర నటాగ్రేసరుని సన్మానించుట :

కొన్నాళ్ళకి కమిటీ మీటింగ్ అయింది. లెక్కా జమా వేసుకొన్నారు. వసూలైన డబ్బులో ఎనిమిది వేలు మిగిలింది. దాన్ని భవన నిర్మాణం కోసం విడిగా ఫిక్సెడ్ డిపాజిట్‌లో వెయ్యాలని నిర్ణయించుకొన్నారు.

"నేను ప్రభుత్వాన్ని ఒక చిన్న స్థలం కోసం అడుగుతాను. దానికి నాతో పాటు కొంత మంది పెద్దలని కూడా తీసుకువెళ్తాను" అన్నాడు రామనాథం.

"నేను నాకు చేతనైన సహాయం చేస్తాను" అన్నాడు సుబ్బారావు.

"నేనూ వస్తాను" అంది పద్మావతీదేవి.

"మన తెలుగు సమితి భవన నిర్మాణం కోసం జాగా సంపాదించే ప్రయత్నంతో పాటు భవన నిర్మాణం నిధి పోగుచెయ్యాలి. మొదట దానికి రామనాథంగారు, నేను, పద్మావతిదేవి గారు ప్రయత్నిస్తాం. రెండో దానికోసం యువకులైన రెడ్డి, వెంగన్నారావు, రంగారావుగార్లు ప్రయత్నించాలి" అన్నాడు సుబ్బారావు.

వెంగన్నారావు వెంటనే అంగీకరించాడు.

"మావల్లనేం అవుతుంది!" అన్నాడు రంగారావు.

"మీరే ఏదైనా ఉపాయం చూడండి" అన్నాడు రెడ్డి.

"ఒక పని చేద్దాం, మన సినిమా యాక్టర్లలో ఒక పెద్ద నటుడికి సన్మానం చేద్దాం. ఆయన తల్చుకుంటే మొత్తం బిల్డింగ్‌కి కావాల్సిన డబ్బు ఇచ్చేస్తాడు. వాళ్ళు తల్చుకున్న సందర్భాలు కొన్ని వున్నాయి" అన్నాడు సుబ్బారావు.

"అలాగే చేద్దాం. కాని నటుడు మన విషయంలో తలుచుకోకపోతే?" వెంగన్నారావు సందేహం వెలిబుచ్చాడు.

"సినిమా వాళ్ళ ప్రచారాల్లో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియదు. కొన్ని కొన్నిచోట్ల అభిమాన సంఘాలే డబ్బులు పోగేసి వాళ్ళ అభిమాన నటుడి పేర విరాళా లిచ్చాయని కొందరంటారు. అభిమానులు తమ సినిమాలు చూడడానికిగాను నటులే డబ్బిస్తారని మరి కొంద రంటారు. ఇలాంటి వార్తలలో ఏది నిజమో తెలియదు. ఇది కుక్కతోక పట్టుకొని గోదావరీదే ప్రయత్నం కారాదు" అన్నాడు రంగారావు.

"మనం పిల్చిన నటుడు మనకి విరాళం ఇవ్వకపోగా మనకి ఆయన మీద అధికంగా ఖర్చు చెయ్యాల్సి రావచ్చును. అంత పెద్ద నటుడు విమానంలో గాని రాడు. పైగా ఇక్కడ ఏ నక్షత్రాల హోటల్లోనో దింపాలి. ఎంత ఖర్చు!" అని రామనాథం కొంచెం భయపడ్తుంటే.

"పోనీ మా యింట్లో దింపుకొంటాను" అంది పద్మావతీదేవి.

"అందరి సందేహాలు విన్నాను. నటుడిని పిలిస్తే అయ్యే ఖర్చు సంఘం పెట్టదు. నేనే సంపాదిస్తాను. ఆయనిచ్చే విరాళాన్ని ఒక్క పైసా తగ్గకుండా భవన నిర్మాణ నిధి కిచ్చేస్తాను. సరేనా?" అని సుబ్బారావు అడిగాడు.

దాంట్లో ఆక్షేపణీయంగా ఏమీ లేకపోవడంతో అందరూ ఒప్పుకొన్నారు-ఆ రోజున నాటక పోటీలు జరిపించి ఆ పెద్ద నటుడిచేత బహుమతీ ప్రదానం చేయించాలని కూడా అనుకొన్నారు. ఆ రోజున టిక్కెట్లు పెడితే వేడి వేడి పకోడీల్లా అమ్ముడు పోతాయని, కొంతమంది నాటకాల కోసం, మరి కొంతమంది నటుడి కోసం, టిక్కెట్లు కొనుక్కొని వస్తారని సుబ్బారావు హామీ ఇచ్చాడు.

రెడ్డి, వెంగన్నారావు ఓ ఆదివారం సుబ్బారావు ఇంటికి వెళ్ళారు. సుబ్బారావా రోజు వాళ్ళని కొంతమంది పెద్దవాళ్ళ యిళ్ళకి తీసుకు వెళ్తానన్నాడు. వాళ్ళు పెద్దవాళ్ళేకాక తెలుగు వాళ్లు కూడా అయినవాళ్ళు అని చెప్పాడు. సుబ్బారావు వాళ్ళని తన కార్లో ఎక్కించుకొని ముందరగా పెట్రోలు బంకుకు వెళ్ళి పెట్రోలు పోయించి బిల్లు కార్యదర్శి తెలుగు సమితి పేరు మీద తీసుకొన్నాడు. "మనం టైమూ శక్తీ ఖర్చు పెడ్తున్నాం చాలు. డబ్బు కూడా ఎక్కడ ఖర్చు పెట్టగలం! వేర్ అండ్ టేర్, నేను సంఘం పనులు నెత్తి మీద వెసుకొన్నందుకు గాను నా కారు కెలాగో తప్పవ్!" అని నవ్వి కారు బయల్దేర దీశాడు.

"మీరన్నది సబబే!" అన్నాడు రెడ్డి నవ్వు కలుపుతూ.

"ఇలా అయితే రామనాథంగారికి సమితి ఓ రెండొందలైనా ఇప్పటి దాకా బాకీ పడి ఉంటుంది" అనుకొన్నాడు రంగారావు.

"రామనాథం ఇలా బిల్లు సమితి పేరు మీద తీసుకోలేదు. ఇద్దరికి ఎంత తేడానో!" అనుకొన్నాడు వెంగన్నారావు.

ఆ రోజు సుబ్బారావు అయిదారు మందిని జీవిత సభ్యులుగా జేర్పించాడు. అలా నాలుగు వారాలు తిరిగే సరికి పాతిక మంది సభ్యులు జేరారు. ఖర్చులూ పోను రెండు వేల నాలుగు వందలు మిగిలాయి.

"అందులో కొంత ఖర్చు పెట్టి ఓ నాటకం వేద్దాం" అన్నాడు రంగారావు.

"తప్పమ్మా, రంగారావు! ఇది నాటక పోటీలు పెట్టడానికీ, నటుడికి సన్మానం చెయ్యడానికీను. ఇప్పుడప్పుడే ఉగాది వచ్చేసిందా మళ్ళీ సంక్రాంతికి నాటక పోటీలు. ఇప్పటి నుంచి మంచి నాటకం ఒకటి ప్రాక్టీస్ చెయ్యండి మీరంతా. అప్పుడు పోటీలో నెగ్గి ఆ మహా నటుడి చేతుల మీదుగా ట్రాఫీలు పుచ్చుకొందురు గాని, ఏం!" అన్నాడు సుబ్బారావు.

"మళ్ళీ సంక్రాంతి దాకా మన కార్యక్రమాలు ఏమీ ఉండవా?" రంగారావు ఆశ్చర్యంగా అడిగాడు.

"మనం ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని సైటు కోసం అడగవచ్చు. సినిమా వేసి డబ్బు సంపాదించ వచ్చు" సుబ్బారావు సమాధానం యిచ్చాడు.

"మొన్న సంక్రాంతికి టికెట్లు పెట్టాం. రేపు సంక్రాంతికి టికెట్లు పెట్టబోతున్నాం. పైగా మధ్యలో సినిమా వేసి టికెట్లమ్మితే సభ్యు లేమనుకుంటారో అని భయంగా వుంది" అన్నాడు రంగారావు.

"ప్రతీదానికి టికెట్లు పెడ్తే సభ్యత్వం కట్టాల్సిన అవసరం లేకుండానే టికెట్లు కొనుక్కొని రావచ్చుకదా, ఇంక సభ్యులుగా ఎవరు జేర్తారు?" అన్న సందేహం వెలిబుచ్చాడు వెంగన్నారావు.

"అలా అయితే టికెట్టు మీద మెంబర్‌కి అర్థ రూపాయి తగ్గిద్దాం. నలుగురున్న కుటుంబానికి రెండ్రూపాయ లాదా అవుతుంది. పైగా సినిమాయే ఒక ఎంటర్ టెయిన్‌మెంట్. అది వెయ్యటమే ఒక కల్చరల్ ప్రోగ్రామ్" అన్నాడు రెడ్డి.

మొదటి సినిమా వేశారు. జోరుగా టిక్కెట్లమ్మారు. ఖర్చులు పోను నాలుగు వందలు లాభం వచ్చింది. దాంతో మరో సినిమా వెయ్యాలని సంకల్పించారు. పూర్వం ఉత్తినే ప్రింటిచ్చిన డిస్ట్రిబ్యూటర్ ఈసారి చివరి నిముషంలో మూడు వందలిస్తేగాని ఇవ్వనన్నాడు. అసలు మళ్ళీ మాట్లాడితే తన దగ్గర ప్రింటే లేదు పొమ్మన్నాడు. అప్పటికే పబ్లిసిటీ విపరీతంగా ఇచ్చారు. మొదటి సినిమాకి ఏ పబ్లిసిటీ లేకుండానే నాలుగు వందలు లాభం వస్తే ఇంత పబ్లిసిటీకి ఒక వెయ్యన్నా రావాలన్న ధోరణిలో ఉన్నప్పుడు సరిగ్గా డిస్ట్రిబ్యూటర్ అలా మొండికి వేశాడు. చేసేదేంలేక అడిగినంత అతగాడి చేతిలో పెట్టారు. రెండో సినిమా ఆడాక లెక్క చూసుకుంటే, పబ్లిసిటీ ఖర్చులు పెరగటం వల్ల రెండు వందలు నష్టం తేలింది.

నవంబరు నెలలో నాటకాల పోటీ గురించిన నిబంధనలు, నియమాలు తయారయ్యాయి. స్థానిక వార్తాపత్రికలలో ప్రకటనలు వెళ్ళాయి. రంగారావు వాళ్ళు వెయ్యదల్చుకొన్న నాటకంతో చేరి మొత్తం నాలుగు నాటికలు పోటీకి వచ్చాయి.

ఇక్కడ జనం నాటకం ఎడా పెడా ప్రాక్టీస్ చేస్తుంటే అక్కడ సుబ్బారావు మెద్రాసుకి ట్రంక్ కాల్స్ కొట్టేస్తున్నాడు. "మీరు తప్పకుండా రావాలి", "మర్చిపోరాదు", "మేం ఆహ్వానాలు అచ్చువేయించేశాం." పైగా తనకు మెద్రాసులో పరిచయం ఉన్నవాళ్ళకి ఫోన్ చేసి స్వవిషయాలన్నీ తీరుబడిగా మాట్లాడుకుని ఆపైన "మీరు కూడా అగ్రనటుడు మా ఊరు వచ్చే విషయంలో ఏ మార్పు రాకుండా చూడండి" అంటూ కోరి ఆ బిల్లుల్ని కూడా తెలుగు సమితికి జమకట్టాడు. ఊళ్ళో "ఆంధ్రుల అభిమాన అగ్రనటుడు వస్తున్నాడు. వివరాలకి తెలుగు సమితి కార్యవర్గ సభ్యుల్నెవర్నైనా సరే అడిగి తెలుసుకోండి" అంటూ పబ్లిసిటీ ఇచ్చేస్తు న్నాడు.

ఇంతలో సంక్రాంతి వచ్చేసింది. ఇళ్ళ ముందు ముగ్గులు వచ్చేశాయి. ఇంటి ఆడపడుచు బుగ్గల్లోకి ఎరుపులు, కళ్ళల్లోకి మెరుపులు వచ్చాయి. ఇంటల్లుళ్ళు, ఇండియాకి పూర్వం రోజుల్లో వైస్రాయి వచ్చినంత ఠీవిగా వచ్చారు.

టౌను హాలు ఆ రాత్రి దీపాలతో వెలిగి పోతోంది. ఎక్కడ లేని జనం వచ్చారు. ఈ దెబ్బతో తెలుగు సమితి ప్రతిష్ఠ పెరిగి పోయిందన్నాడు సుబ్బారావు.

పద్మావతీదేవి అగ్రనటుడిని తీసుకురావటానికి రామనాథం కారు వేసుకొని వెళ్ళింది. సుబ్బారావు అందర్నీ హడావిడి పెట్టేసి తను పడిపోతున్నాడు. హోటలుకి ఫోన్ చేస్తే, అగ్ర నటుడు మేకప్ అవుతున్నాడని ఒక గంట ఆలస్యం వుందని "నాటకాలు మొదలు పెట్టమన్నారు' ' అని కబురు వచ్చింది.

"మొదలెట్టేయండి. అందరూ రేడీగా వున్నారు కదా: నటుడుగారు వచ్చాక స్టేజి మీదకు తీసుకువస్తాం. దండలు వేసేవాళ్ళు రెడీయే కదా! ఫొటోగ్రాఫర్ ఏడి? అతన్ని ఫొటోలు తియ్యమని చెప్పాను. నేనే చెప్పాను. కమిటీతో చెప్పలేదంటారా, ఫరవాలేదు. కమిటీ ఒప్పుకోకపోతే ఖర్చు నేనే పెట్టుకుంటాను. చెట్టంత నటుడు వస్తే, మనం రెండొందల ఖర్చుకు వెనుతీస్తామా! పరువు నష్టం! అలాంటి దరిద్రపు బుద్ధులు మంచివి కావు. ప్రెస్సు వాళ్ళెవరయ్యా..... వాళ్ళకి సైడ్ వింగ్ అంతా రిజర్వు చెయ్యమన్నాను" అంటూ హడావిడి పడ్డా కార్యక్రమానికి తొందర చేశాడు.

రామనాథం నాటకం ఒక కష్ట సాధ్యమైన కళ అని అందులో పోటీలకి నాటకాలు వెయ్యడం ఇంకా కష్టమని నటులందరు నెలల తరబడి రిహార్సల్స్ వేసుకొని తయారయి వచ్చారని, ఈ రోజున బహుమతి ప్రదానం చేసే ఆయన కళాతపస్వి అని తన కింకా ఆలస్యం చెయ్యడం ఇష్టం లేదని నాటకాలు మొదలు పెడ్తున్నాం అని న్యాయ నిర్ణేతలు వచ్చేసారని చెప్పాడు.

అయితే నాటికల పోటీదార్లందరు అగ్రనటుడు వచ్చాక ఆయన్ని తమ నటనతో ముగ్ధుడ్ని చెయ్యాలన్న కోరికతో ఆయన వచ్చాకే వేస్తాం అన్నారు. న్యాయనిర్ణేతలు అది కుదరదనిచెప్పి ముందు లాటరీ వేసి నిర్ణయించిన ప్రకారం నాటికలు మొదలు పెట్టాలని అన్నారు.

నాటికలు మొదలు పెట్టారు. ప్రేక్షకుల్లో రెండు రకాల వారున్నారు, మొదటివారు కేవలం అగ్రనటుడ్ని కనులార చూసి జన్మ ధన్యం చేసుకొందామను కొన్నవారు. వాళ్ళు ఏ మాత్రం అలికిడయినా "వచ్చేశాడు" అంటూ అటుకేసి తలలు తిప్పి చూడటం, కనకపడకపోతే నిలబడి, నిరాశ పొంది కూర్చోడం చెయ్యడం మొదలెట్టారు. ప్రేక్షకుల్లో రెండో వర్గంవారు నాటికల పోటీ చూద్దామనే ఉద్దేశంతో గౌరవంతో వచ్చినవాళ్లు ఈ సంచలనానికి విసుక్కోవటం మొదలు పెట్టారు.

ఎలాగైతేనేం మూడో నాటిక అవుతుండగా అగ్రనటుడు వచ్చాడు. అప్పుడు సరిగ్గా స్టేజి మీద "ధైర్యం వుంటే కాల్చు. ఈ అన్యాయాన్ని నేను సహించను" అంటున్నాడు, తుపాకి గురిపెట్టిన రెడ్డితో రంగారావు. అగ్రనట్టుడు ఎప్పుడైతే వచ్చాడో. ప్రేక్షకులలో నూటికి తొంభై మంది లేచి నిలబడి వెనక్కి తిరిగి ప్రవేశ ద్వారం వేపు కుతూహలంగా చూడటం మొదలు పెట్టారు, "మా అభిమాన నటుడు వెంటనే వేదిక మీదకి రావాలి" అంటూ గొడవ మొదలు పెట్టారు.

"దయచేసి కూర్చోండి. ఈయాన్ని ఇప్పుడే వేదిక మీదకి తీసుకు వస్తాం" అంటూ సుబ్బారావు జనాన్ని గట్టిగా కసుర్తూ సర్దటం మొదలు పెట్టాడు.

అభిమాన నటుడ్ని వేదిక మీదకి తీసుకు వచ్చే భారం రామనాధానికి అప్పచెప్పి, సుబ్బారావు వేదిక మీదకి ఎక్కి తెర లాగేశాడు. రెడీగా పెట్టుకున్న బల్ల కుర్చీలు పూల కుండీలు తెర ముందర వేయించి లైట్లు ఎడ్జస్టు చేయించాడు.

వేదిక మీద పద్మావతీదేవి కూతురు ఆంధ్రుల అభిమాన నటుడికి హారతిచ్చింది. దానికా పెద్ద నటుడు మిగుల సంతసించి "ఆడపడుచులు హారతులివ్వటం, అన్నయ్యలు ఆ పళ్ళెంలో డబ్బులు వేయటం తెలుగువారి ఆచారం. ఈ చెల్లెమ్మ హారతి పట్టింది. ఈ చెల్లెమ్మే ఈ తెలుగు సమితి, ఈ సందర్భంగా ఈ సమితికి వెయ్యి నూటపదహార్లు కానుకగా చదివిస్తున్నాను" అన్నాడు. సభంతా చప్పట్లతో దద్దరిల్లి పోయింది.

అగ్రనటుడిని కుర్చీలో కూర్చోబెట్టి సుబ్బారావు సన్మాన పత్రం చదివాడు. అగ్రనటుడిని వెయ్యి నాలుకలతో పొగిడాడు, "పొగిడిన వాళ్ళకి పొగడబడ్డ వాళ్ళు తృణమో ఫణమో ముట్ట చెప్పటం మన అలవాటు. అందుకని ఈ సందర్భంగా ఈ సంవత్సరం నాటక పోటీలకు గాను కొన్న మొత్తం బహుమానాలకైన ఖర్చు నేనే బరిస్తాను" అన్నాడు అగ్రనటుడు. ప్రేక్షకులు అయిదు నిముషాల పాటు ఆగకుండా చప్పట్లు కొట్టారు.

ఆ పైన పద్మావతీదేవి దండ తీసుకొని వచ్చింది. అగ్ర నటుడు మెడ వంచబోతుండగా అతని సెక్రటరీ అలాంటి వెధవ పని చేసి పబ్లిక్ ఇమేజ్ పాడ్చేసుకోవద్దు అన్నట్టుగా వారించాడు.

అది కుచేలుడు తెచ్చిన అటుకులను రెండు గుప్పిళ్ళు ఆరగించి మూడో గుప్పిడి తీసుకోబోతున్న కృష్ణుడిని రుక్మిణీదేవి వారించినట్టుగా జనం అనుకున్నారు. ఆ దండ వేయించుకొని ఉంటే మీ భవన నిర్మాణానికిగాను ఏ పాతికవేలో ఇస్తున్నాను అనేవాడేమో అనుకొని వేయించుకోనందుకు నిరాశపడ్డారు. అగ్రనటుడు పద్మావతీదేవి చేతిలోని దండనందు

కొని ఉపన్యాసం మొదలుపెట్టాడు. "మీ అదరాభిమాలనికి నా కృతజ్ఞత. నేను మీ కిచ్చిన మొత్తం అతిస్వల్పం. దానికే మీరు చాలా సంతోషం వెలిబుచ్చారు. నిజానికి మీరు నా నుంచి ఇంకా ఎక్కువ మొత్తమే ఆశించి ఉండవచ్చు. అయితే నా లాంటి ప్రముఖ నటుడికి రోజా సన్మానాలు జరుగుతూ ఉంటాయి. ప్రతిచోట శక్తికి మించి ఇస్తూ పోతే మేమే దివాళా తీస్తాం. అయితే మాకు మా అభిమానులతో మా సంపద పంచుకోవాలన్న కోర్కె చాలా బలంగా ఉంటుంది. ఈ సంపద మా అభిమానుల నుంచి మాకు వచ్చిందే. అందుకని నేను ఎక్కడకు వెళ్ళినా ఏదో కొంత ఇస్తూ ఉంటాను. ఇప్పుడు ఇక్కడ మొత్తం పదిహేను వందలిచ్చాను నేను. నేనంత మొత్తం ఇచ్చానని చెప్పటం కాదు, కాని నా కల్లా ఇవ్వటం అలవాటు. అది కళా సరస్వతికి పాదపూజగా భావిస్తాను.

ఈ రోజు ఖర్చుపెట్టినది, మీ అభిమానం ఉంటే తిరిగి సంపాదిస్తాను. మీ అభిమానం ఉన్నంతవరకు నటిస్తూనే ఉంటాను. సంపాదిస్తూనే ఉంటాను. ఇప్పటి హీరోయిన్ల మనవరాళ్ళతో హీరోగా వేసే రోజు కోసం నాతో పాటు మీరూ ఎదుర్చూస్తారని నాకు తెలుసు. సెలవు" అంటూ ముగించాడు.

జనం ఆపకుండా చప్పట్లు కొట్టారు. ఫొటోగ్రాఫరు అన్ని కోణాల్లోను ఫొటోలు తీశాడు. ఫ్లాషుల వెలుగులో ముంచెత్తాడు. అగ్రనటుడు వేదిక దిగి ముందు వరసలో కూర్చు న్నాడు."రెడీగా ఉండండి" అంటూ లోపలికి ఓ కేకపెట్టి సుబ్బారావు తెర లాగించాడు. రొమ్ము ముందుకి జాచి చేతులు వెనక్కి పెట్టుకొని నిలబడి ఉన్న రంగారావు మీద రెడ్డి ఢామ్మని పిస్తోలు కాల్చాడు.

న్యాయనిర్ణేతలు రంగారావుని ఉత్తమ నటుడిగా నిర్ణయించారు. కాని రంగారావు మనస్సు వెలితితో నిండిపోయింది. సినిమా నటుడు ఆకట్టుకున్నట్టుగా జనాన్ని తన నాటకం ఆకట్టుకో లేకపోయిందనీ, అంత మంది జనం వచ్చారంటే అది సమితి గొప్పదనం వల్ల కాక నటుడి పట్ల గల గ్లామర్ వల్లనీ అతని మనసు మూల్గింది.

ఆ రాత్రి అగ్రనటుడికి కార్యవర్గం డిన్నరిచ్చింది. మందు మంచి నీళ్ళలా ఖర్చయింది. దానికి పది మందికి అయిదు వందలైంది. అతని మిగతా ఖర్చులు వెయ్యి అయ్యాయి. గోదావరి మేతకు లంక ఈతకు చెల్లయింది.

## 5. రామనాథం తన శకటమును గూల్చుట :

ఎల్లాగైతేనేం తిప్పలు పడగా, ఆ రాష్ట్ర ప్రభుత్వం వారు తెలుగు సమితికి చీమల పేటలో ఒక చిన్న స్థలం విద్యాలయ భవన నిర్మాణానికి గాను 50 సంవత్సరాల లీజ్ మీదిచ్చారు. విద్యాలయం అన్న పదానికి చేతైనంత విశాలంగా అర్థం చెప్పుకోవచ్చు అని కూడా అన్నారు. అర్థరాత్రి పూట అయిదుగురు పిల్లలకి తెలుగు నేర్పినా అది విద్యాలయమే! అందుకని తెలుగు సమితికి తక్షణ కర్తవ్యం భవన నిర్మాణం అయింది.

ఆ క్రితం సంవత్సరం వేసిన సినిమాల లెక్కలు, సావనీర్ అచ్చేసినదాని లెక్కా జమా

అన్నీ ఆడిట్ చేయించి పంపమని సమితుల రిజిస్ట్రార్ నోటీసు లివ్వటం మొదలు పెట్టాడు. కొందరు డబ్బు లివ్వలేదు. కొందరు టికెట్ల పుస్తకాలు తీసుకొన్న వారు పుస్తకాలు ఇవ్వలేదు. కాని అందరూ పెద్దవాళ్ళే! "వచ్చే వారం ఇస్తాం. ఆ పుస్తకాలు మరొకళ్ళ కిచ్చాం. ముందరేమో అమ్మి పెట్టండి అని బతిమాల్తారు. ఇప్పుడేమో పీకల మీద కూర్చుంటారు. ఇవ్వక పారిపోతామా" అన్నారు. అందులో పోలీసాఫీసర్లు, ఇన్‌కమ్‌టాక్సు వాళ్ళు, రకరకాల ప్రభుత్వోద్యోగులున్నారు. రెడ్డికి తల వాచిపోయింది. రంగారావు నిర్లిప్తంగా వూరుకొన్నాడు. "ఇల్లాంటి చిన్న విషయాల గురించి బాధపడ్తే అయినట్టే. నోటీసులిచ్చి ఆ రిజిస్ట్రారే ఊరుకొంటాడు. మన భవన నిర్మాణ కార్యక్రమం గురించి ఆలోచించండి" అన్నాడు సుబ్బారావు.

"మీ సలహా ఏమిటి?" అని అడిగించుకొని సుబ్బారావు చెప్పాడు.

"సినిమాల్లో పైకి రావటానికి తిప్పలు పడ్తున్న నటులు నాటక సమాజాలు పెట్టుకొని భుక్తి గడుపుకొంటూ ఉంటారు. వాళ్ళు ఏ రోజు తిండి ఆ రోజు వెతుక్కోవలసిన వాళ్ళు. వాళ్ళకి దారి ఖర్చులు, తిండి ఖర్చులు ఇస్తే వచ్చి నాటకం వేసిపోతారు. వాళ్ళకి మూడో తరగతి టికెట్లు కొనిస్తే చాలు. సినిమా వాళ్ళంటే ప్రజలకి చాలా గ్లామర్ ఉంది. అటువంటి నాటకం ఒకటి వేయించి టికెట్లమ్ముకుందాం. ఓ అయిదారు వేలు లాభం వస్తుంది. పూర్వం వచ్చిన ఎనిమిది వేలున్నాయి. పైగా జీవిత సభ్యులిచ్చిన చందాల్లో ఇంకా పదిహేను వందలదాకా మిగిలింది. పదిహేను వేలతో ముందర ఓ షెడ్డులాంటిది వేసుకోవచ్చు" అన్నాడు.

ఏర్పాట్లు బ్రహ్మాండంగా సాగిపోతున్నాయి. పబ్లిసిటీ ఘనంగా ఇచ్చారు. పోస్టర్లంటించారు. ప్రకటనిచ్చారు, స్కూటర్ల మీద కార్ల మీద తిరిగి టిక్కెట్లమ్మారు. హడావిడి పడ్డారు. ట్రంకాల్స్ చేశారు, బిల్లులు పోగేశారు. పద్మావతీదేవి రామనాథం కార్లో తిరిగి వంద రూపాయల పెట్రోలు తగలేసి డెబ్భైఅయిదు రూపాయల టికెట్లమ్మింది. దానికి కూడా రామనాథం తట్టుకున్నాడు. అతను తన కారుకి టైర్లూడదీసి జాకీల మీద మోపు జేయడం తరువాత జరిగింది. మద్రాసు నుంచి సినీ కళాకారుల నాటక బృందం వచ్చాక జరిగింది.

రైలు స్టేషన్‌లో దిగుతూనే "మేం కాన్డబ్బు తీసుకోకుండా నాటకం వేస్తున్నందుకైనా ఫస్టు క్లాసు ఛార్జీలివ్వచ్చుగా. ఈ మూడో తరగతి ప్రయాణంతో వొళ్ళంతా నొప్పులు. కాఫీ టిఫిన్లయ్యాక మమ్మల్ని డాక్టరు దగ్గరకు తీసుకు వెళ్ళండి. కాస్త పెద్ద డాక్టరు దగ్గరికి" అన్నారు.

"మేము ఉత్త పుణ్యానికి నాటకం వేస్తున్నాం కదా. కాస్త మమ్మల్ని మంచి లాడ్జింగ్‌లో దింపవచ్చు కదా"

"ఫ్రీగా నాటకం వేయించుకొంటున్నారు కదా, ఈ సాంబారు భోజనంకాక కాస్త మంచి భోజనం పెట్టకూడదూ."

"వెంగన్నారావుగారూ, ఈ చొక్కానిస్త్రీ చేయించి తీసుకురండి."

"రంగారావు గారూ మంగలాడిని పిలిపించి గడ్డం వేయించాలి మీరు నాకు."

"రెడ్డిగారూ! కంగారులో నేను సరియైన చీర తెచ్చు కోలేదు. మీ ఆవిడ నడిగి అయిదువేళ్ళ వెడల్పు జరీ ఉన్న పట్టుచీర పట్టుకు వస్తారూ."

"రామనాథంగారూ! రేపు మీ కార్లో మాకు ఊరు చూపించాలి."

అంటూ ఊదర గొట్టేశారు. డాక్టరు దగ్గరకు వెళ్ళడానికి, మంగల్ని పిలిపించడానికి రామనాథం కారు వాడుకొన్నారు. సుబ్బారావు దగ్గర, పద్మావతీదేవి దగ్గర వాళ్ళ పప్పులుడక లేదు. మర్నాడు ఊరంతా కార్లో తిరిగారు. ఆ కారు రామనాథంది.

"ఎల్లాగో ఇంత దూరం వచ్చాం. ఈ చుట్టు పట్ల చూడదగ్గ ప్రదేశాలు చూసేసి పోతాం. ఏమంటారు రామనాథంగారు" అటూ కబురు పెట్టారు. అప్పటికే రామనాథం కారు తుక్కయిపోయింది. రామనాథం జాకీ మీద చక్రాలూడ బీకి చక్రాలు దాచేశాడు. ఆ విధంగా తన శకటాన్ని నేల కూల్చి "కారు పాడైంది" అని కబురు పెట్టాడు.

సుబ్బారావుతో నటులు "మరో కారు కావాలి" అంటే "వేధవ్వేషాలు వెయ్యక రైలెక్కండి" అన్నాడు. ఆ విధంగా వాళ్ళని రైలెక్కించి లెక్కలు చూసుకొంటే ఖర్చు అయిదువేలు. ఆదాయం నాలుగు వేలు తేలింది.

"ఈ సమితి కనక మరోసారి ఉచితంగా ప్రదర్శన ఇస్తాం అన్న వాళ్ళతో ప్రదర్శన ఏర్పాటు చేస్తే నేను రాజీనామా యిస్తాను." అన్నాడు రంగారావు.

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఎనిమిది వేలు కాకుండా జీవిత సభ్యుల చందాలో అయిదు వందలు సుబ్బారావు దగ్గర మిగిలింది. అదీ తెలుగు సమితి ఆర్థిక పరిస్థితి, నాటక ప్రదర్శన పూర్తయ్యే సరికి.

## ౬. సుబ్బారావు సంఘ వర్ధన ఫలకమును దించుట:

మరో ఏడాది గడిచింది. కొత్తగా నిధులేవీ తెలుగు సమితికి జమ పడలేదు. మరో చలన చిత్ర నటుడు వచ్చాడు. మరో సన్మానం జరిగింది. విరాళం విషయంలో మొదటి నటుడే నయం అనిపించాడు. రిజిస్టర్డ్ సమితుల రిజిస్ట్రారు మరో నోటీసు ఇచ్చాడు. రంగారావు నెవరూ నాటకం మని అడగలేదు. అతను పోటీలకి నాటకం వేయలేదు. ఈసారి పోటీకి రెండే నాటకాలు వచ్చాయి. సుబ్బారావు, చలన చిత్ర నటుడు రాగానే నాటకం మధ్యలో తెర లాగించాడని వాళ్ళలో ఒక బృందానికి కోపం వచ్చింది. రెండో బృందానికి సుబ్బారావు మర్యాద లేకుండా మాట్లాడాడని కోపం వచ్చింది. వచ్చిన నటుడు మాత్రం "సుబ్బారావులాంటి మనుషులుండబట్టే సమితులనేవి భూమి మీద మన్నుతున్నాయి" అన్నాడు. ఆ నటుడు సుబ్బారావు పడే హడావిడినే చూశాడు. అతనికి సుబ్బారావు సాధించింది స్వల్పం అని తెలియదు, సమితి సభ్యులకి తెలుసు తప్ప. బయటి వాళ్ళందరూ సుబ్బారావు కార్యదక్షతను మెచ్చుకొనేవాళ్ళే. వాళ్ళకు ప్రత్యేక ఆహ్వానాలు పంపడంలో సుబ్బారావు శ్రద్ధ తీసుకొన్నాడు. సభ్యులకి ఆహ్వానాలు పంపించాడు రంగారావు. చీమలాంటి సాధారణ సభ్యులు సుబ్బారావు దృష్టిలోకిరారు.

ఇల్లా ఉండగా రామనాథం ఓ యేడాదిపాటు డెప్యుటేషన్ మీద విదేశాలు వెళ్ళవలసి వచ్చింది. సుబ్బారావు తెలుగు సమితి ప్రెసిడెంట్ అయ్యాడు. సరిగ్గా ఆ సమయంలో ఆ

రాష్ట్రం ప్రభుత్వం "మీకు భవన నిర్మాణం కోసం స్థలం ఇచ్చాం కాని మీరింకా పునాదులైనా తీయలేదు. మేము ఆ స్థలాన్ని ఏల వాపసు తీసుకోరాదో బలమైన కారణాలు చూపించవలసింది' ' అంటూ ఉత్తరం వ్రాసింది. దాంతో సుబ్బారావుకి వేడి పుట్టింది.

సుబ్బారావు కరపత్రాలు పంచాడు. "భవన నిర్మాణ నిధికి శాయశక్తులా సహాయం చెయ్యండి. అధ్యక్షుడు సుబ్బారావు"; "మన సంస్కృతిని రక్షించుకొనే బాధ్యత మనదే అధ్యక్షుడు సుబ్బారావు."

ఇల్లా ప్రకటనలు, కరపత్రాలు తన పేరుతో సహా అచ్చేయించాడు. తన ఇమేజి బిల్డింగ్ కిది బాగా తోడ్పడుతుందని ఊహించాడు.

తన ఇంటికి తెలుగు సమితి అధ్యక్షుడు, సుబ్బారావు అని బోర్డు పెట్టాడు.

సుబ్బారావు ఏ మాత్రం డబ్బు సంపాదించలేకపోయాడు. కంగారు పడి కమిటీ మీటింగ్ పిల్చాడు. "మనకి ఫిక్సెడ్ డిపాజిట్స్‌లో ఇంకా ఎనిమిది వేలుంది. అందులో కొంత ఖర్చుపెట్టి శంకుస్థాన చేద్దాం" అన్నాడు.

"ఉన్న కొద్ది డబ్బు ఆడంబరాలకి ఖర్చు పెట్టడం నా కిష్టంలేదు" అన్నాడు రంగారావు.

"ఈ రోజు పరిస్థితు లలాంటివి. మనం శంఖుస్థాపన ముఖ్యమంత్రిచేత చేయించాలని నా ఆలోచన. అల్లా చేస్తే ఆ రాతి ఫలకాన్ని కదిల్చే ధైర్యం ఎవరికి ఉండదు. ఆ విధంగా మనకి కొంచెం ఊపిరి తీసుకొనే వ్యవధి దొరుకుతుంది" సుబ్బారావు నచ్చ చెప్పాడు.

"ఇన్నాళ్ళబట్టీ మనకి ఊపిరి తీసుకునే వ్యవధి లేక పోయిందా? రేపు ఆ విధంగా వ్యవధి సంపాదించినా మనం నిధి ఏ విధంగా పోగు చేస్తాం?" రంగారావు గట్టిగా అడిగాడు.

"ఏముంది. ఆంధ్ర ప్రభుత్వాన్నో, ఏ దేవస్థానాన్నో అడుగుతాం" సుబ్బారావు తేలికగా జవాబు చెప్పాడు.

"మన స్వశక్తితో నిధి పోగు చెయ్యాలని నా అభిప్రాయం. మీలాంటి పెద్దలంతా తలో వెయ్యి వేసుకొన్నా ఈ పాటికి మనకి చాలినంత డబ్బుండేది" రంగారావు నిర్మొహమాటంగా చెప్పాడు.

"రంగారావుగారూ! మీరు ఉద్రేకపడి పోతున్నారు. ఈ గండం గడవనివ్వండి. మీరన్న మార్గం కూడా ప్రయత్నిద్దాం"

"శంఖు స్థాపన పేరుతో ఉన్న కొద్ది డబ్బులో రెండు మూడు వేలు ఖర్చు పెట్టడానికి నేను ఒప్పుకోను."

"మిగిలిన సభ్యుల అభిప్రాయం ఏమిటి?" అంటూ సుబ్బారావు పద్మావతీదేవి కేసి జూశాడు.

"ప్రస్తుతానికి మీరు సూచించినది బాగానే ఉంది" అంది ఆమె.

రెడ్డి ఆ మాటే అన్నాడు. వెంగన్నారావు రంగారావును సమర్థించాడు. కమిటీ సుబ్బారావు సూచనను ఆమెదించింది. ఆ మర్నాడు రంగారావు, వెంగన్నారావు కమిటీలో తమ సభ్యత్వానికి రాజీనామ ఇచ్చారు.

సుబ్బారావు బాధపడలేదు. ముఖ్యమంత్రిని కలుసుకుని ప్రవాసాంధ్రులలో తను ముఖ్యుడనని, అధ్యక్షుడనని చెప్పుకొని తాము త్వరలో భవన నిర్మాణం చేయబోతున్నామని దానికి వారు తమ దివ్య హస్తంతో శంఖుస్థాపన చెయ్యాలని కోరాడు. ముఖ్యమంత్రి సరే నన్నాడు.

ఆహ్వానాలు అచ్చు వేశాడు సుబ్బారావు. "తెలుగు సమితికి అధ్యక్షుడైన సుబ్బారావు మిమ్మల్ని, ముఖ్యమంత్రిగారు చేయు శంఖుస్థాపనకి ఆహ్వానిస్తున్నాడు" అంటూ ఘనంగా శంఖుస్థాపన ఏర్పాట్లు చేశాడు. ఫౌండేషన్‌లో స్టోన్ చెక్కించే భారం తనే వహించాడు. ముఖ్యమంత్రి వచ్చి ఫౌండేషన్ స్టోన్‌కి కట్టిన ముసుగు తొలగించాడు ఓ శుభ ముహుర్తాన.

"ముఖ్యమంత్రి అయిన శ్రీ.... ఈ రాతి ఫలకాన్ని దించారు.

అధ్యక్షుడు సుబ్బారావు"

అని ఉన్నాయి దాని మీద శిలాక్షరాలు. పద్మావతీదేవి మూర్ఛపోయింది తన పేరు లేనందుకు.

## 7. సమితి రక్షణ :

సుబ్బారావుకి, ముఖ్యమంత్రి చేత శంఖుస్థాపన చేయించాక ఏం చెయ్యాలో పాలు పోలేదు. అతడు రాయి మీద తన పేరు వేయించుకొన్నాడన్న కారణంగా రెడ్డితో సహా సభ్యులందరు వ్యతిరేకం అయ్యారు, "భవన నిర్మాణానికిగాను మీ సహాయం కావాలి. ఇట్లు అధ్యక్షుడు సుబ్బారావు" అంటూ ఉత్తరాలు రాశాడు. ఆంధ్ర ప్రభుత్వానికి, దేవస్థానాలకీ, ఆంధ్రరాష్ట్రంలో ఉన్న డబ్బున్న ప్రముఖులకి. కాని జవాబు రాలేదు.

కనిపించిన వాళ్ళంతా "ఈ మధ్య సమితి కార్యక్రమాలేం లేవా? యీ యేడాది ఏ నటుడిని పిల్తున్నారు? ఎవర్ని పిలిచినా మాకో అయిదు పాస్‌లు కావాలి" అంటూ అడగటం మొదలుపెట్టారు. సుబ్బారావుకి మరో నటుడిని పిలిచి సన్మానం చెయ్యటానికి మించిన గత్యంతరం లేకపోయింది. ఆ సందర్భంగా నాటికల పోటీ నిర్వహిస్తున్నామని ప్రకటించినా నటులెవరూ నాటిక వేయబోయి ఫూల్ అవడం ఇష్టంలేక ముందుకు రాలేదు. చాలామంది ప్రేక్షకులకి సినిమా నటుడు వస్తే చాలు నాటికల గొడవ పట్టదు. కాని సినిమా నటుడిని పిలవటానికి కొన్నాళ్ళు నాటికల పోటీ ఒక సాకు. "వీళ్లు నాటకాలెయ్యకపోతే నాకేం. ఈసారి కాస్తగ్లామరున్న నటిని పిలుస్తాను. ఆవిడొచ్చి స్టేజి మీద అందంగా కూర్చుంటే అంతకు మించి చూడ్డానికి ఎవరు మాత్రం కోరుకుంటారు?" అని సుబ్బారావు ఆలోచించి అలాగే ఏర్పాడు చేశాడు.

జనం విరగబడ్డారు. అందులో చందాలు కట్టిన సభ్యులు తక్కువ. వి.ఐ.పి.లు ఎక్కువ. ముఖ్యులకు ప్రవేశం ఉచితం. ఇతరులు, సభ్యులు కొంత రుసుము చెల్లించాలి. ఆ విధంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి అయిన ఖర్చు వచ్చిన రాబడి కంటే హెచ్చయింది. అయితే భవన నిర్మాణ కార్యక్రమానికిగాను విడిగా పెట్టిన డబ్బులోంచి భవన శంఖుస్థాపనకి కమిటీ,

జనరల్ బాడీల అనుమతులతో విత్‌డ్రా చేసిన సొమ్ములో కొంత మిగలటం వల్ల అది ఇక్కడ సర్దేశాడు సుబ్బారావు. కాని దాంతో సుబ్బారావు దగ్గర ఉన్న సమితి డబ్బు పూర్తిగా ఖర్చు అయింది. యీసారి సర్వసభ్య సమావేశం అంటూ జరిగితే తనకి నష్టమేగాని లాభం లేదు. తెలుగు సమితి వట్టిపోయింది. ఫిక్సెడ్ డిపాజిట్ల లోంచి డబ్బు తియ్యటానికి సభ్యులు ఒప్పుకోరు!

రామనాథం తిరిగి వచ్చాడు. సుబ్బారావు తన సభ్యత్వంతో సహా రాజీనామా ఇచ్చి సమితికి తన పట్ల కృతజ్ఞత లేదని తను సమితికి ఎంతో చేసి నలుగురిలో చాలా పరపతి పెంచానని అన్నాడు. కార్యక్రమాలకి ఉచిత ప్రవేశం పొందిన పెద్దలు "మరే" అన్నారు.

రామనాథం వచ్చాక పరిస్థితులను అర్థం చేసుకొన్నాడు. సభ్యులకి చందా కట్టడం వల్ల వచ్చిన లాభం ఏం లేదు. ఎందుకంటే సమితి ఏడాది కోసారి చేసే సినీనటుని సన్మాన కార్యక్రమానికి ఎలాగో టికెట్టు కొనుక్కొనే వెళ్ళాలి. అందుకని అయిదుగురు కమిటీ సభ్యులు మరో పది మంది అమాయకులు మాత్రమే సభ్యత్వం కడ్తున్నారు. పాతిక మంది జీవిత సభ్యుల చందాని సుబ్బారావు ఖర్చు పెట్టేశాడు. మామూలుగా ఈ సొమ్ముని ఫిక్సెడ్ డిపాజిట్‌లో వేసి, సమితి వచ్చిన వడ్డీ తినాలి. కాని సుబ్బారావు అసలే ఖర్చు పెట్టేసాడు. ఈ జీవిత సభ్యులు ఇక మీదట కమిటీలకు "వ్యర్థ భారాలు". దానికి జీవిత సభ్యులు బాధ్యులుకారు. పైగా భవన నిర్మాణం చేసి తీరాలి. దానికి అయిదే వేలున్నాయి.

ఈ సందర్భంగా అత్యవసర సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశాడు. అందులో రంగారావు ఉద్రేకంగా మాట్లాడాడు. "ఈనాడు మన సమితి ఇలా ఉందంటే కారణం మనమే. మనకు కావలసిన వాటికి మనం మన శక్తిని నమ్ముకోలేదు. ఈ ఊళ్ళో యాభై వేల మంది తెలుగు వాళ్ళున్నారు. అందులో అయిదువేల మంది అయిదేసి రూపాయల చొప్పున మరో అయిదే వేల మంది ఒక రూపాయి చొప్పునా ఇచ్చినా ముప్పైవేలవును. పదివేల మందిని చందాలు అడగటం కష్టం అనీ అందుకని ఏ సినిమా నటుడో, ఆంధ్ర ప్రభుత్వమో, ఏదో దేవస్థానమో మనకి అంత మొత్తం ఇవ్వాలని ఆశించి అదృష్టానికి అడ్డదారులు వెతికాం. నాలుగు సంవత్సరాలు వ్యర్థపుచ్చాం. డబ్బున్నవాళ్ళ దగ్గర్నుంచి డబ్బు వసూలు చెయ్యడం చాలా కష్టం. వాళ్ళు అడిగిన వాళ్ళకల్లా చెయ్యి విదల్చక పోవడం వల్లే వాళ్ళు డబ్బున్న వాళ్ళుగా మిగిలేరు. అందుకని వాళ్ళని తప్పు పట్టను. వాళ్ళేదో పొడిచేస్తారని నమ్మిన వాళ్ళది తప్పు. వాళ్ళు పదిపైసలిచ్చారంటే దానివల్ల ఒక రూపాయి లాభం ఉంటేనే ఇస్తారు. సినిమావాళ్ళు కూడా మనుష్యులే. ప్రపంచంలో ప్రజాశక్తి, ధనశక్తి అని రెండున్నాయి. మొదటి శక్తి రెండోదాన్ని సంపాదించగలదు. కాని రెండోది మొదటిదాన్ని సంపాదించలేదు.

బందరులో జాతీయ కళాశాల కోసం మహామహులంతా వీధుల్లో జోలె కట్టి ముష్టెత్తి విరాళాలు సంపాదించేవారని మా నాన్నగారు చెప్తూ ఉంటారు. మనం అలాగే సంపాదిద్దాం. మనకి పెద్దలిచ్చే భూరి విరాళాలు వద్దు. ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చే ఆల్పులు చాలు. చలిచీమల సహాయం చాలు. బలవంతమైన సర్పపు పడగ నీడ వద్దు. ఏమంటారు?"

"ఇన్నాళ్ళు వేరే మార్గాలు ప్రయత్నించారు. ఈ మార్గం తొక్కి చూడవచ్చు" అన్నారు రెడ్డి, వెంగన్నారావులు. రామనాథం ఒప్పుకున్నాడు.

"ఇంటింటికి నేను తిరగలేను. మా అమ్మాయికి ఎమ్మే ఫైనలు పరీక్షలు కూడాను" అంది పద్మావతీదేవి.

రంగారావు, రెడ్డి, వెంగన్నారావు, రామనాథం బానర్లు పుచ్చుకొని జోలె కట్టుకొని వీధి వీధి తిరిగారు. అందరు ఒకట్లు రెండ్లు పడేశారు. మరికొందరు అయిదు పదులు ఇచ్చారు. అరవలు, కన్నడిగులుకూడా రంగారా వడుగుతున్నాడనో, వెంగన్నారావున్నాడనో వాళ్ళకి తోచించి వేశారు.

"నేను తెలుగు సమితికి కష్టపడి సంపాదించిన పరపతి ఈ నాటితో గోవిందా. ఈ ఊళ్ళో పెద్దలంతా ముక్కు మీద వేలేసుకొని నాకు ఫోన్లు చేస్తున్నారు. నేను తలెత్తుకొని తిరగలేకపోతున్నాను" అనడం మొదలు పెట్టాడు సుబ్బారావు.

ఇన్నాళ్ళు వి.ఐ.పి.లుగా ప్రతికార్యక్రమానికి అధిక సంఖ్యలతో తరలివచ్చిన వారిళ్ళముందు తెలుగు సమితి సభ్యులూరేగుతుంటుంటే వాళ్ళకి ప్రాణ సంకటమై అయిదో పదో రాల్చి అల్లా రాల్చా వచ్చినందుకు గిలగిల్లాడిపోయారు. తెలుగు సమితి మరీ ముష్టి సమితై పోయిందేమిటని సుబ్బారావుకి ఫోను చేశారు. వాళ్ళకి సినిమా నటులని, దేవస్థానాలని దేబిరించడం ముష్టిగా అనిపించలేదు. ఎందుకంటే వాళ్ళ జేబుల్లో డబ్బులకి రెక్కలు రావాల్సిన ప్రమాదం ఉండదు ఆ యాచన వల్ల.

ఎవరేమనుకొన్నా జగన్నాథ రథచక్రాలు సాగిపోయాయి. తెలుగు ప్రజల ఉత్సాహం పొంగి పొర్లింది. అందులో పడి స్వార్థపరులు దూరంగా కొట్టుకుపోయారు. సంవత్సరం తిరిగేసరికి తెలుగు సమితికి తనది అంటూ భవనం ఏర్పడింది. దాని ప్రారంభోత్సవానికి సుబ్బారావు తనంతట తనేవచ్చి అందరి దృష్టి శంఖుస్థాపన ఫలకం వైపు తిప్పుదామని చూశాడు. ఎవరూ సుబ్బారావుని పట్టించుకోలేదు. తెలుగు వాడిగా పుట్టిన పుణ్యంవల్ల అతన్ని ఎవరూ "ఎందుకు వచ్చావు ఫో!" అన్లేదు. వెంగన్నారావు ఫలకాని కడ్డంగా సున్నం డబ్బా దొర్లించాడు.

ఆంధ్ర ప్రభుత్వం తెలుగు ప్రపంచ మహాసభ సందర్భంగా గ్రంధాలయం పెట్టుకోమని ఓ వెయ్యి పుస్తకాలిచ్చింది. "నేను పూర్వం రాసిన ఉత్తరాలిన్నాళ్ళకి ప్రభుత్వం కంట పడ్డాయన్నమాట" అని సుబ్బారావు కనిపించిన వాళ్ళందర్తో చెప్పాడు.

అందరు మొహం మీదే నవ్వారు.

చీమల పేటలో నిర్మించిన భవనం ఊళ్ళో అందరు తెలుగు వారికి కేంద్రం అయింది. ఆర్భాటం లేకుండా అక్కడ తెలుగు వారికి కావలసిన కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఉత్త కబుర్లు చెప్పెవరూ అక్కడ. తెలుగు వాళ్ళకి గట్టిమేలు తలపెట్టి ధృడ నిశ్చయులై పనిచేస్తున్నారు.

ఎవరు? తెలుగువాళ్ళే!

## 8. తుది పలుకు :

ఇప్పటికే విస్తరించిన రచనలో చెప్పనివి చాలా ఉన్నాయి. కార్యవర్గ సభ్యులు కొందరు పదవులను పట్టుకొని ఎలా వేళ్ళాడ్తారో చెప్పలేదు. కొందరు అధ్యక్షులు కార్యవర్గ సమావేశాలలో నిర్ణయాలు తమ కనుకూలంగా ఉండే పక్షంతో ఎంత తొందరగా వాటిని రికార్డ్ చేస్తారో లేని సమయాల్లో "మనకి ప్రస్తుతానికి ఏకాభిప్రాయం కుదరలేదు. అందుకని సమావేశాన్ని మరోసారికి వాయిదా వేస్తున్నాను" అని ఏ విధంగా కప్పదాటు వేస్తారో చెప్పలేదు. సర్వసభ్య సమావేశాల్లో తస్మదీయుల్ని నోరు ఎల్లా నొక్కాలో నిజమైన అధ్యక్షులకి కరతాల మలకం. ఇవన్నీ చెప్దామనుకొన్నా., ఇదో థీసిస్ అంత పెద్ద రచన అయిపోతుందని మానేస్తున్నాను.

దానికి పాఠకులు నన్ను క్షమించాలి.

*- ఆంధ్ర సచిత్ర వార పత్రిక, '77*

★